# దగా

ఒకోసారి అన్నీ చక్కగా సమకూర్తాయి వాటంతటవే; ఒకోసారి ఎన్ని తంటాలుపడినా ఏదీ అనుకున్నట్టు జరగదు.

ఆ రోజు బండి మామూలుగా సరిగా వచ్చేది కాస్తా అరగంటపైగా లేటయింది. కృష్ణమూర్తి ఖంగారుగా ఆలస్యంగా బయల్దేరినందుకు, బండి రావడం ఆలస్యమయింది గాబట్టి సరిపోయిందిగాని, లేకపోతే ఆ రోజుకింక ప్రయాణం ఆపుకోవాల్సి వచ్చును. మళ్ళీ తెల్లారిందాకా అటుపోయే బండి లేదు. ఉరుకులు పరుగులుగా స్టేషన్లోకొచ్చిపడ్డ మూర్తి రుమాల్తో మొగం గట్టిగా రుద్దుకొని దేవుడికి కృతజ్ఞత చెప్పుకున్నాడు.

మనసు కుదురుగాలేదు. పరిపరివిధాల ఆలోచనలు పోతున్నాయి. ఏమిటో దడ. తీవ్రమైన సంచలనం, కలవరం. ఉప్పెనలాంటి ఉద్వేగమేదో శరీరాన్ని అనవసరంగా కదిలించి అలసట పెడ్తోంది. ఈ సంరంభాన్నంతనీ తట్టుకోలేక ప్లాట్‌ఫారం నాపరాళ్ళ మీద చతికిలబడ్డాడు కృష్ణమూర్తి. బండి లేటు అరగంటకన్నా హెచ్చయేలాగుంది. యింకా యెంత ఆలస్యమౌతుందో! అక్కడికి తనెప్పటికి జేరతాడో!

తనువచ్చి అర్ధగంట దాటినా యింకా బండి రానందుకు, దేవుడ్ని, విధిని, తన కర్మని, ప్రభుత్వాన్ని అన్నిట్నీ తిట్టిపోశాడు; బండి వచ్చే సూచనలేం కనబళ్ళేదు.

ఆ ఊర్లో ముద్రపడకొండో తారీఖున పడింది. న్యాయంగా అయితే మర్నాటికల్లా జేరాల్సిన ఉత్తరం; అయిదు రోజులు తీసుకుంది. తీరావచ్చాక తనింట్లో లేకపోవడమొకటి! దానా దీనా పది రోజులగ్గాని కబురందలేదు. కృష్ణమూర్తి ఆదుర్దాగా తల చేతుల్లో బిగించి కళ్ళు మూసుకున్నాడు.

గంటపోయాక బండి బాధగా బరువుగా ప్లాట్‌ఫారంమీదికి పాకింది. కృష్ణమూర్తి గబగబా యెదురుగ్గా ఉన్న పెట్టె ఒకదాంట్లో కెగబడి, ఓ వారకూలబడ్డాడు. ముచ్చెమటలు పోస్తున్నాయి. నలతగా ఉంది. తలని కిటికీ

---

డి. హనుమంతరావు

ఊచలకి పదిలంగా ఆనించి పడుకోవాలని పించింది.

కాని అలాచేస్తే వీళ్ళంతా ఏమనుకుంటారో! తనేదో పెద్ద రోగంతో తీసుకుంటున్నా డనుకుంటారు. కుశల ప్రశ్నలు వేస్తారు. యోగక్షేమాలు విచారించి సానుభూతి వ్యక్తం చెయ్యాలని చూస్తారు ... రోత!

కృష్ణమూర్తి బిగబట్టుకు అలాగే అని కూర్చున్నాడు.

ఎదురు బెర్త్‌మీద యిద్దరు స్కూలు పిల్లలు. దబ్బపండ్లలా పచ్చగా పుష్టిగా చలాకిగా ఉన్నారిద్దరూ. ఆ చిగురు కిటికీ దగ్గిర ఒక నడివయసు దాటినామె, యీ ప్రపంచంలో, బ్రతుకులో ఆశనంతనీ కోల్పోయినట్టు దిగాలుగా తల వెనక్కి ఆనించి, బయట దూరంగా ఎక్కడో మేఘాల్లోనో కొండల్లోనో కళ్ళుంచి రెప్పార్పకుండా చూస్తోంది. ఎదురు బల్లమీద పిల్లలకి కొద్దిదూరంలో ఎవడో రాజకీయ వేత్తలాగ ఈప్రపంచంలోతనకితెలియందిలేదన్నట్టు చూస్తూ, మధ్య మధ్య నలిగిన పేపరు పేజీల్లో మొగం దాచుకుంటున్నాడు. ఎవడన్నా ఖర్మగాలి తనవంక చూస్తే, వెంటనే తన అఖండజ్ఞానాన్నంతనీ అతడికి పంచియియ్యాలన్న ఆత్రం అతనిలో కనబడుతోంది. అవతల రెండు బల్లలమీద పొడుగ్గా పరుపులు పరిచేసి, అదంతా తమ సామ్రాజ్యమన్నట్టు ఎవరో ఒక ఘరానా పెద్ద మనిషి, ఆయన భార్యకాబోలు, ఒకామె మాంచి ఉన్నత స్థాయిలో ఠీవిగా చాచుక్కూచున్నారు. కృష్ణమూర్తి అందరి వంకా బెదురు బెదురుగా చూసి, తలని నెమ్మదిగా కిటికీ కమ్మీకానించాడు.

ఇంత తొందరగా అకస్మాత్తుగా యీ వార్త వినాల్సిరావడం — అంతా ఏదో మాయలో ఉన్నట్టుంది. అసలా కార్డు చూడగానే, అది తనదేనా అనిపించి ఎడ్రసింకోసారి పరిశీలనగా చూశాడు కూడ.

జానకి మామూలుగా హుషారుగా కమ్మని ఉత్తరం రాసి పదిరోజులు కూడా కాలేదు. పాపాయికి జుబ్బాలు, స్వెట్టర్లు కుడ్తున్నానని, బారసాలకి సిల్కుచీర గులాబిరంగుది తేవాలనీ, తనని చూడాలనుందనీ ఏమేమోరాసింది. యింతలో యిలా అవుతుందని కలలో కూడా అనుకోలేదు తను.

ఆ విషయం గురించి ఎంతో ఆలోచించాడు. ఎన్నో పథకాలు వేసుకున్నాడు. ఆ నెలంతా సెలవు పెట్టేసి అక్కడే ఉండాలనుకున్నాడు. నిజానికి ఆమె అక్కడికి వెళ్ళకముందు యిద్దరికీ అస్తమానం యిదే పని — రాబోయే పాపాయిని ఆహ్వానించడ మెలాగాలని. ఎన్నో వాదనలు! చర్చలు! నిర్ణయాలు!

అవన్నీ చివరికిలా తుడిచిపెట్టుకు పోతాయనుకోడం, ఓ పట్టాన చాతగావడంలేదు. సముద్రకెరట మొకటి

అనుకోకుండా ఎగసివచ్చి, ఎంతో కష్టపడి గంటలకొద్దీ ఓర్పుతో కట్టిన యిసక గూళ్ళన్నీ ఒక్క ఊపులో కూల్చేసినట్టు, కృష్ణమూర్తి మనసు బాధగా రెపరెపలాడింది.

కార్డొకసారి పైకితీసి తన మతి పోగొట్టిన ఆ నాలుగు లైన్లూ మళ్ళీ చదివాడు.

“చి. సౌ. అమ్మాయి ప్రసవించి మగపిల్లాడ్ని కన్నదని తెలపడానికి ఆనందంగా ఉంది. కాని అమ్మాయి వొంట్లో ఏం బాగాలేదు. డాక్టర్లు రకరకాలుగా మాట్లాడుతున్నారు. నువ్వొకసారి వస్తే బాగుంటుంది. అవసరమయితే టెలిగ్రాం యిస్తాను.”

జానకి లెక్కప్రకారం యిప్పుడింకా ఎనిమిదోనెల. యింకో నెలదాకా ఏం జరగదని తన నమ్మకం. ఏమన్నా



ప్రమాదమేమో! పైగా 'డాక్టర్లు' అంటా దేమిటి? ఎంతోమందికి చూపించినట్టు అర్ధమా? అసలు జబ్బేమిటో, పరిస్థితి యెలా ఉందో వివరంగారాయడంమానేసి అవసరమయితే టెలిగ్రాం యిస్తా నంటాడు! అవసరమంటే ఎప్పుడనో! టెలిగ్రాం వచ్చేదాకా రావద్దని ఉద్దేశ్యమా! కృష్ణమూర్తికి మామగార్ని దగ్గిరున్న ఎలక్ట్రిక్ స్తంభానికి వేలాడదీసి ఉరి తీయాలనిపించింది.

ఉత్తరం వచ్చి గదిలో పడున్న నాలుగు రోజులూ తన దినచర్య తటాలున గుర్తుకొచ్చి బాధకలిగింది.

ఆఫీసులో కొలీగ్ పెళ్ళికని అంతా దగ్గిర్లో ఏదో ఊరుకి వెళ్లారు. అక్కడ్నించీ దగ్గిరున్న మరో ఊరు— ఊరికే చూసిరావడానికి. హాయిగా, సంతోషంగా నవ్వులతో కేరింతల్తో గడిచి పోయింది కాలం.

"అక్కడది వొంటో బాగోకమంచ మెక్కింది; నేనీ నాలుగు రోజులూ దాని ఆలోచనే లేకుండా పేలుతూ తిరుగుతూ పేకాట, సినిమాల్తో ఖుషీ చేస్తున్నాను!" గుండెల్ని గుప్పిట్లో బిగించి గట్టిగా పిసికినట్టయింది కృష్ణ మూర్తికి. అదే ఆలోచన పదేపదే మెదిలి మనసు కలచింది.

వెనక్కి జేరగిలబడ్డాడు. ఒళ్ళంతా తిమ్మెర్లు పట్టి ఎవరో కుళ్ళబొడిచి నట్టుంది. కొందరికి రానున్న విషయాలు ముందుగానే తెలుస్తాయేమో! జానకి అయిదో నెల్లోనే పుట్టింటికి వెళ్ళడమంటే చాలా బాధపడింది; ఎన్నో నిష్ఠూరా లేసింది.

"నేనిక్కడుండడం మీకు కష్ట మయితే, పోనీ, అలాగే వెళ్ళిపోతా న్లెండి...."

"నేనక్కడికి వెళ్లాక యింక మీకు గుర్తుంటానేమిటి? మీ పేకాట, సిని మాలు, స్నేహితులు..."

"ఇంకీ వెళ్ళడం, వెళ్ళడం యిలాగే వెళ్ళిపోతానేమో, తిరిగి రావడం అంటూ లేకుండా! యీ రెండు మూడు రోజు లైనా కాస్త దగ్గిరుండకూడదూ!..."

కృష్ణమూర్తి కళ్ళలో నీళ్ళు తిరిగాయి ఆ మాటలన్నీ గుర్తుకొచ్చి. రకరకాల సన్నివేశాల్లో జానకి ఎన్నోవిధాల తన నెలాగయినా నొప్పించి కసిదీర్చు కోవాలని చూసింది. అంత త్వరగా పంపించడానికి ఒప్పుకున్నందుకు. కాని ఆమె నీరసం, బొత్తిగా రక్తంలేక పోవడం చూస్తే యీ చాకిరితో యిక్కడే ఉంటే ఆమె తనకి దక్కడం అసంభవ మనిపించి పంపేశాడు.

ఒక్కసారిగా మంచమెక్కిన జానకి ఆకారం ఊహల్లో మెదిలి ఒళ్లు జలదరించింది. ఆ వెలిగేమొగం బాధతో పాలిపోతుంది. ఎప్పుడూ చలాకిగా పని చేసే చేతులు నీరసంగా పక్కకి వాలి

పోయుంటాయి. ఆమె కళ్ళల్లో కాంతి కొడిగట్టిన దీపంలా కళ తగ్గి ఉంటుంది.

కృష్ణమూర్తి ఉలిక్కిపడి లేచి కూచున్నాడు. యీ డాక్టర్లకేంతెలియదు! అంత ప్రమాదమేం ఉండదు! అంతా సవ్యంగా అయిపోతుంది. యీ పాటికి బాబుని చూసుకుని మురిసి పోతూంటుంది జానకి. ముసలాడు ఊరికే గాభరా పడుంటాడు. అసలే ఒక్కగా నొక్క కూతురు! గారాబం! ఖంగారెక్కువ. దానికితోడు అది కొంచెం రమ్మని రాయమని ఖంగారు పెట్టుంటుంది! కృష్ణమూర్తి భరోసాయిచ్చుకున్నాడు నెమ్మదిగా.

రైలు కూసి పెద్దధ్వనితో కదల బోతూంది.

"బాబుగారూ! బాబుగారూ!" అప్పన్న పరుగెత్తుకొస్తున్నాడు, గేటు లోంచి. కృష్ణమూర్తి మొదట చూడ లేదు. చివరికి వాడు కిటికీ దగ్గరకొచ్చి ఒగుర్తుస్తూ, "మీరొచ్చేసినాక పోస్టు బంట్రోతు యిచ్చి పోయాడు" అని చెప్పి కవరొకటి లోపలికి విసిరాడు. రైలు వేగం అందుకుని కదిలిపోయింది.

టెలిగ్రాం!

కృష్ణమూర్తి బల్లలమధ్య కిందపడ్డ టెలిగ్రాం తనది కాదన్నట్టు అదేదో తేలో, తాచుపామో అన్నట్టు వెర్రిగా చూశాడు చాలాసేపు తియ్యకుండా. పెట్టెలో ఉన్న వాళ్ళంతా అతని వంకే వింతగా చూశారు.

నెమ్మదిగా తీశాడు కృష్ణమూర్తి. తెరవబుద్ధేయలేదు. ఎక్కడ్నుంచి! అవ సరమయితే టెలిగ్రాం యిస్తానన్నాడు మామయ్య. అవసరమయితే ... కాదు! యిదక్కడ్నించి కాదు. ఎక్కడ్నించ యుంటుందా, అని ఆలోచించాడు ... బహుశా రామం దగ్గిర్నుంచయుండాలి. అన్నట్టు రామం వస్తానని రాశాడు యివాళో, రేపో. రావడానికి వీలు పడుండదు; టెలిగ్రాం యిచ్చాడు. అంతే. యిదక్కడ్నుంచి కాదు! జానకి దగ్గ ర్నుంచి కాదు!

కృష్ణమూర్తి పెదాలు మాట్లాడు తున్నట్టు వణుకుతున్నాయి, శబ్దంచెయ్య కుండా. బెర్త్‌మీద దూరంగా పడేసి, కవరువంక అలాగే చూశాడు.

ఎదురుగ్గా ఉన్న పిల్లలిద్దరూ చేతులు చాటు చేసుకుని మధ్య మధ్య ఏవో రహ స్యాలు చెప్పుకుంటూ పెద్దపెద్ద కళ్ళతో తదేకంగా యితనివంకే చూస్తున్నారు. ఆ పక్కనున్న పెద్ద మనిషి పేపరు మడిచేసి అతనికేసే చూశాడు. ఘరానా మనిషి, భార్య తమ పనుల మధ్య ఒకసారి అంతరాయం కలిగించిన యితని వంక చూసి మళ్ళీ వాళ్ళ పనుల్లో మునిగి పోయారు. ఆ మూలదగ్గిరామె తల తిప్పకుండానే మధ్యమధ్య వాలుచూపులు యితని వంక విసురుతోంది. కృష్ణ

మూర్తికేం పాలుపోలేదు. ఆవేశమెక్కినట్టయింది. గబగబా లేచివెళ్ళి ముందు గుమ్మం దగ్గిరకి పోయి నిలబడ్డాడు.

శరవేగంతో రైలు దూసుకుపోతూంది. చెట్లు, గుట్టలు, మనుష్యులు అన్నీ హడావిడిగా వెనక్కిపోతున్నాయి. దూరాన పొలంలో యెక్కడో ఆడుకొంటున్న కుర్రాదెవడో గబగబా రైలుకేసి పట్టుకోవాలన్నట్టు పరుగెత్తుకొస్తున్నాడు చెయ్యెత్తి అరుస్తూ. మామిడితోటలు, డొంకలు, గుబుర్లు... ఎన్నో..కృష్ణమూర్తికి గభాల్న కిందికురికి ఆ డొంకల్లో మాయమై పోవాలనిపించింది.

క్రింద మెట్టుమీద నిలబడి ఎవడో రైలుకూలి జండా ఊపుతున్నాడు. కృష్ణమూర్తి ప్రయత్నం కొనసాగలేదు. అతనక్కడికి రాగానే క్రిందతను తలపైకెత్తి పరిశీలనగా చూశాడు.

"ఏం, వంట్లో బాగోలేదా?" క్రిందతను అడుగుతున్నాడు.

కృష్ణమూర్తి మాట్లాడలేదు. ప్రక్కనున్న తలుపు రేకులో మొగమొకసారి చూసుకున్నాడు. జుట్టంతా రేగిపోయి చాలా అసహ్యంగా దోక్కుపోయి కనబడింది. ఆ పరిస్థితుల్లో తనని చూసినవాళ్ళెవరన్నా అలాగే అనుకుంటారు.

కాసేపటికి పని పూర్తి చేసుకుని కూలిఅతను పైకెక్కి లోపలికి వెళ్ళిపోయాడు. కృష్ణమూర్తి టెలిగ్రాం పైకి తీసి పట్టుకుని పరిశీలించాడు. జానకి గురించేనా! కాదు, అబద్ధం! జానకి బాగానే ఉంటుంది! యిదెక్కణ్ణుంచో! రామం యిచ్చుంటాడు! గుండెలమీద మోయలేని బరువునుంచినట్లు బాధపడ్డాడు కృష్ణమూర్తి దాన్ని చేత్తో పట్టుకుని.

గబగబా కవర్ని ముక్కలు ముక్కలుగా చింపేసి దూరంగా విసిరేశాడు. దూసుకుపోతున్న గాలి వేగానికి గులాబిరంగు కాగితం ముక్కలన్నీ చిన్నచిన్న పురుగుల్లా తమాషాగా ఎగిరిపోయాయి వెనక్కి.

కృష్ణమూర్తి గుండె తేలికయింది. మనస్సు హాయిగా చక్కగా ఉంది. జానకి కీ పాటికి నయమై పోయుంటుంది. హాయిగా పాపాయిని ఆడిస్తూ తన సంగతి చెబ్తూంటుంది. కృష్ణమూర్తి మెదళ్లో ఎన్నో తీయని తలపులు మెదిలాయి. చాలా ఉల్లాసంగా ఉంది.

"టికెట్, ప్లీజ్!" చెయ్యి చాచాడు టికెట్ కలెక్టరు.

హుషారుగా టికెట్ తీసి చూపెట్టాడు కృష్ణమూర్తి. సంతకంపెట్టి తిరిగి యిచ్చేస్తూంటే, కృష్ణమూర్తి కతన్నెక్కడో చూసినట్టనిపించింది.

"మీ పేరేమిటండి?"

"వెంకట్రావు."

"మీరు సెకండ్ ఫారం నర్సాపురంలో చదివారు కదూ?"

"అవును. మీకెలా తెలుసు?''

"నాపేరు కృష్ణమూర్తిలెండి, మనిద్దరం ఒకే బెంచిమీద కూర్చొనేవాళ్ళం"

"ఓహో! కృష్ణమూర్తా! గుర్తుపట్టలేక పోయాను సుమండీ!''

ఇద్దరూ కృష్ణమూర్తి సీటువైపు నడిచారు. కృష్ణమూర్తి తొందర తొందరగా ఆ రోజులు, హైస్కూలు కాలేజి ఎలా అయిందీ, కాలేజి చదువు, ఆ తర్వాత తన ఉద్యోగం, అదెలా వచ్చిందీ అంతా కొద్ది హాస్య ధోరణిలో, మధ్య మధ్య 'విట్లు' లాంటి ఛెణుకులు మిలాయించి చెప్పాడు.

"మీరు చాలా మారిపోయారు. అప్పుడు మీరసలు ఎవర్తో మాట్లాడకుండా ఏదో మూల కూర్చొనేవారు. అసలు క్లాసులో ఉన్నట్టే ఉండేదిగాదు! బాగా హుషారుగా కనబడ్తున్నారు! ఏంకధ?" వెంకట్రావు ఆశ్చర్యంగా, నవ్వుతూ అన్నాడు.

"హుషారు కాకపోతే ఏమిటి చెప్పండి! 'పుత్రోత్సాహము తండ్రికి' అన్నారు ఎవరో. అందులోనూ మొట్టమొదటగా మగపిల్లాడు ... బారసాలకి వెళ్తున్నాను." కృష్ణమూర్తి విజయ గర్వంతో అన్నట్టు అందరివంకా చూశాడు. ఆ మాటలువిని అంతా యితని వంకే చూపు తిప్పారు.

"అలాగా! అయితే, అప్పుడే చాలా పురోగమించారన్నమాట! కంగ్రాట్స్!



"ఏం సుదినం యివాళ!! నువ్వునాకు ఇంత ఆప్యాయంగా ఇవన్నీ పెట్టి ఆరగించవా అని బలవంతపెడుతున్నావెందుకనీ??..."

"మరే_ నా చేతనైనపని నేనూ చేయాలని అక్కని ఒప్పించి మరీ అమలు జరుపుతున్నానూ ... ఇవాళేకదూ – వన్య మృగ సంరక్షణోత్సవదినం!... అందుకని ...''

"మరదలుపిల్లా! అదా సంగతి! రా! ఈ పక్కనే కూర్చో! నే తినగా మిగిలినవన్నీ నీ వాటాయేగా ...

---

మేమింకా చాలా వెనకబడున్నాంలెండి! మొదలే లేదు!" నవ్వాడు వెంకట్రావు.

"మీరింకా సింగిలేనా? అరెరే! ఏంబ్రతుకండీ అది!" కృష్ణమూర్తి సానుభూతీ, నిరసనా సమపాళ్ళలో వ్యక్తం చేశాడు.

"అసలు, పెళ్ళెప్పుడయింది? మాకెవరికీ చెప్పకుండానే చేసేసుకున్నా రే?"

"సరిగ్గా ఏడాదిమీద నెలయిందంతే. ఎవరికీ తెలియజెయ్యడానికి వీల్లేక పోయిందండీ. చడీ చప్పుడూ లేకుండా మంగళగిరికొండ మీద పెళ్లి చేసేసుకుని కాపరం మొదలెట్టాకగాని పెద్దవాళ్ళూరుకోలేదు!"

కృష్ణమూర్తి కొక్కసారిగా లాకు తలుపులు తెరిచినట్టయింది. జానకి గురించి మాట్లాడాలనే ఆరాటం మహాప్రళయంలా కట్టలన్నీ తెంచుకుని మాటల రూపంలో అతనికి తెలియకుండానే బయటపడ్తోంది.

అతను కాలేజీలో చదివే రోజులు. ఎక్కడో గది తీసుకునుండేవాడు. ఆ యింట్లో అమ్మాయిలూ అబ్బాయిలూ అంతా తనని అన్నయ్యా అని పిల్చేవాళ్ళు. ఒకరోజు యింట్లో పెద్దవాళ్ళెవరూ లేనివేళ పేకాట ఆడ్డానికి రాజూ, సరళా తనని కూడా పిలిచారు. నాలుగో చేయిగా జానకి కూర్చుంది.

ఆమెనలా మొట్టమొదట చూసినప్పుడు తనకి కలిగిన అభిప్రాయమేమిటో సరిగ్గా చెప్పలేడు. ఆ అమ్మాయి బాగా డబ్బున్నది. చాలా తెలివైనది. పొడుగూ పొట్టీకాదు. సన్నగా యెర్రగా ఉంటుంది. మహాకవులు, శిల్పులు కళాకారులు చేసే వర్ణనల ప్రకారం ఆమె అందమైంది కాకపోవచ్చు. కాని అందర్నీ ఆకర్షిస్తుందనడం మాత్రం ఖాయం. ఆ కళ్ళలో ఏదో ఎప్పుడూ వెతుకుతున్నట్టుండే చూపు కృష్ణమూర్తిని కట్టేసింది. ఆమెక్కడో ఆకాశంలో విహరించే తారామణి అన్నట్టు, తనీ భూలోకంలో కొట్టుకునే మానవుడన్నట్టు అనుభూతి కలిగింది. ఆ తర్వాత తర్వాత ఆమెతో పరిచయ మెక్కువవడానికి తోడ్పడిన సంఘటనలెన్నో జరిగినప్పటికీ ఆ భావం మాత్రం అతనిలో చెదిరిపోలేదు. అదొకరకం ఆరాధన. ఆమెని తనదాన్ని చేసుకోవాలంటే తనెంతో గొప్పవాడు కావాలనే పిచ్చిపట్టుకుంది. శుభ్రంగా గౌరవంగా కనబడాలని తంటాలుపడేవాడు. పైగా తనకెంతో మంది పోటీ. ఆమె ఆరాధకులెందరో! అందులో కొంత మంది తనకన్నా ఎక్కువ సన్నిహితంగా ఉండేవాళ్ళు. కొంత మంది నిజంగా తనకన్నా గొప్పవాళ్ళన్న యీర్ష్య కూడా ఉండేదా రోజుల్లో. యిదంతా అలా ఉంచి, వాళ్ల అమ్మా నాన్నా తల్చుకుంటే తనకన్నా గొప్ప సంబంధం తీసుకురాగలరు!

ఈ యిబ్బందులన్నీ యిలా ఉండగా తను పై చదువులకోసం దూరంగా వెళ్ళిపోవాల్సి వచ్చింది. ఆమెని కలుసుకోడానికి వీలుపడేది గాదు. ఒక విధంగా చూస్తే అలా దూరమవడమే మంచిదయిందేమో! మనుష్యులు దూరమైన కొద్దీ మనసులు దగ్గిరౌతా యంటారు.

ఆమె అప్పుడు గుంటూరులో చదువు తూండేది ఒంటరిగా హాస్టల్లో ఉండి. తను వాల్తేర్లో ఉండేవాడు. జానకిమీద పెళ్ళిఒత్తిడెక్కువైన రోజుల్లో ఒకానొక శుభదినాన యిద్దరూ ఒక నిశ్చయానికి వచ్చేశారు. ఫలితం, ఎవరికీ తెలియకుండా, ఎవరో కొద్దిమంది స్నేహితుల సమక్షాన, కొండమీద దండలు మార్చేసుకున్నారు.

"జానకి నన్ను పెళ్ళి చేసుకుందంటే, నిజంగా అదామె వినయానికి, విశాల హృదయానికి, సంస్కారానికీ నిదర్శనమనాలి..."

వెంకట్రావు బాధగా ఆవలించి వెళ్ళిపోయే మార్గమెలాగా అని అటూయిటూ చూశాడు. ఇదేదో గారడీ సాయబు వాగుడుధోరణి అన్నట్టు పిల్లలు, పెద్దలు అంతా తమాషాగా దొంగచూపులు చూస్తున్నారు.

"ఈ యేడాది నా జీవితంలో ఓ తియ్యటి కలనుకోండి. నా గడిచిన యిరవైరెండేళ్లూ ఒక యెత్తు, యిదొక్కటీ ఒకెత్తు. ఎప్పుడూ యింతటి ఆనందం, ఉత్సాహం ఎరగను. దీనికంతకీ జానకే కారణం. జానకి లేని రోజుల్లో ఎలాఉండేవాణ్నో తల్చుకుంటే నామీద నాకే రోతపుడ్తుంది! – ఆ హోటలు మెతుకులు, అసహ్యమైనగది, ఎక్కడి వక్కడే బట్టలు, పుస్తకాలు! యిప్పుడు మాయిల్లు చూశారంటే ముచ్చటౌతుంది. అంతా ఎక్కడుండాలో అక్కడే. కిటికీలకి, గుమ్మాలకి తెరలు. గుమ్మంమీద మనీషిడే గీసిన కొండలు గుట్టలమధ్య ఒక్కడూ కర్రనానుకుని నడిచే "చిర యాత్రికుడు" పెయింటింగ్, గదుల్లో మూలల్ని గుండ్రని స్టూల్స్‌మీద పూల కుండీలు. అదంతా నువ్వు వచ్చి చూడాలి, అంతే. ఏం చెప్పను? ఎంతని చెప్పను?..."

వెంకట్రావు నెమ్మదిగా లేచి మిగతా వాళ్ళ టికెట్లు చూడ్డం మొదలెట్టాడు. పిల్లలిద్దరూ తమలోతాము మధ్యమధ్య కళ్ళతో ఏవో మాట్లాడుకుంటున్నారు. తనధోరణి అందరికీ విసుగు కలిగిస్తోందని కృష్ణమూర్తికి తెలుసు. అయినా అదొక నయాగరా జలపాతం! దాని ముందు, అతని వివేచనాబలం చాలా అల్పం.

"జానకి నా జీవితంలో అడుగుపెట్టక పోతే అసలునేను మానవుణ్ణనిపించుకో డానికి అర్హుణ్ణికానేమో!......" కృష్ణమూర్తి ఆగినట్టే ఆగి మళ్ళీ మొదలెట్టాడు.

"వస్తా, మళ్ళీ కలుసుకుందాం." వెంకట్రావు తొందరగా దిగి ప్లాట్‌ఫారంమీద జనంలోకలిసిపోయాడు.

సిగరెట్ ముట్టించాలనిపించి, వెంటనే భగ్గున అగ్గిపుల్లగీసి ముట్టించాడు కృష్ణమూర్తి. తాపీగా ఓ దమ్ము వదిలి

పిల్లలిద్దర్నీ అడిగాడు, "ఎక్కడికి పోతారు" అని.

"వేటపాలెం. స్కూలునుంచి యింటికి పోతున్నాం... సెలవులిచ్చేశారు ...... పరీక్షలై పోయాయి..." పిల్లలిద్దరూ యుగళంగా సమాధానాలు గబగబా చెప్పేశారు.

"యింక సెలవులంతా హాయిగా అమ్మవాళ్లో కూర్చొని గారాంచెయ్యొచ్చు గదూ!" కృష్ణమూర్తి నవ్వుతూ అన్నాడు.

"యింకెప్పుడూ ఆ బడికి పంపొద్దని చెప్పాలి!"

"తప్పు, అలా అనకూడదు. చక్కగా కష్టపడి అమ్మా నాన్న చెప్పినచోట చదువుకోవాలి. ఇప్పుడు బాధగానే ఉంటుంది; తర్వాత తర్వాత పస్తాయించుకుంటారు, ఆనాడు అమ్మా, నాన్న చెప్పినట్టు చదువుకోలేదే అని!"

ఆ పిల్లలిద్దరూ వెంటనే విరగబడి నవ్వడం మొదలెట్టారు. ఒకడు రెండోవాడి తలపట్టుకుని చెవిలో ఏదో రహస్యం పలికాడు. దాంతో యిద్దరూ కళ్ళలో నీళ్ళు తిరిగేలాగ పొట్టలు పట్టుకొని నవ్వేశారు. కారణం తెలియకపోయినా కృష్ణమూర్తి కూడా నవ్వొచ్చేసింది. అలా నవ్వినవ్వి కాసేపు ఆగారిద్దరూ. మళ్ళీ ఒక్కసారి యిద్దరూ ఒకర్నొకరు చూసుకుని యిందాకటికన్నా ఎక్కువగా విరగబడి నవ్వేశారు.

"ఏం, ఎందుకలా నవ్వుతారు!" కృష్ణమూర్తి అయోమయంగా నవ్వుతూనే అడిగాడు.

"మీరు, మరీ..." ఒకడు మొదలెట్టి నవ్వుతో ఆగిపోయాడు.

"మా బొర్రతాతలా మాట్లాడుతున్నారు!" రెండోవాడు పూర్తిచేసి నవ్వులోమునిగిపోయాడు నోటిని చేత్తో మూసుకుంటూ.

కృష్ణమూర్తి చిన్నబుచ్చుకోలేదు. నవ్వొచ్చింది.

"తాతని కాకపోయినా, నాన్ననయ్యానుగా!"

పిల్లలిద్దరూ నవ్వునాపేశారు.

"ఏంపేరు పెడతారు?" ఒకడడిగాడు.

బయటికి చూస్తున్నామె ఒక్కసారి లోపలికి తనవంక చూసింది, అతను చెప్పేది వినాలన్నట్టు. వెంటనే తనే కలగజేసికొని, "ఏడుకొండలవాడిపేరు పెట్టండి!" అంది.

మొదటున్న పెద్దమనిషి కూడా ఆదే సమయంలో తనూ మాటలు కలిపాడు, "ఏడుకొండలేమిటండీ, మరీ పాతపేరు! పైగా యీ రోజుల్లో! నన్నడిగితే శరశ్చంద్ర అని పెట్టండి."

"మరి, నేను చెప్పేది వినండి. పేరు విషయంలో నాయిష్టమేంలేదు. అంతా ఆమె యిష్టమే. అసలు జానక్కి తెలిసినంతగా యీ విషయాలేవీ నాకు తెలియవు. ఆమాటకొస్తే చాలమందికి తెలి

యవు. అదంతా ఒకరకం వ్యక్తులకి చాలా తేలిగ్గా అలపడుతుంది. జానకి నిజంగా అపురూపవ్యక్తి......

‘‘పెళ్ళికాకముందు ఆమె యెదుట నేను చాలా అల్పుడిలా ఫీలయే వాణ్ణని చెప్పానుగదూ! ఆమె నన్ను చూసి యీసడించుకుంటుందనీ. ఏదో ఆకాశం లోంచి కిందికి చూసినట్టు మాట్లాడు తుందనీ ఊహించుకునేవాణ్ని. కాని జానకి నిజంగా దేవత. ఆమె మనస్సు వెన్నలాంటిది. నా మాట ఎప్పుడూ కాదనలేదు. నేనెప్పుడన్నా మూర్ఖంగా మాట్లాడినా, ప్రవర్తించినా ఎన్నడూ ఎదురుమాట చెప్పేదికాదు. మాట్లాడ కూరుకునేదంతే... అంటే అలాంటి సందర్భాలెన్నో తటస్థించాయని కాదు నే చెప్పేది...ఏవన్నా సర్దాగా మాట్లాడు కునేప్పుడు అభిప్రాయభేదాలు అంటూ వస్తాయిగదా? అవి పెరిగి పెద్దవవ కుండా మధ్యలోనే త్రుంచేసేది...’’

‘‘అదుగో మా ఊరు వచ్చేసింది!” పిల్లలిద్దరూ గబగబా చేతిసంచులు గిర గిరా తిప్పుతూ, ఒకర్నొకరు తోసు కుంటూ క్రింది కురికారు. వాళ్ళలో “హమ్మయ్య, వదిలాడు!’’ అన్న సంతోషం స్పష్టంగా కనబడ్తోంది. వాళ్ళ వెనకాలే యెదురుగాఉన్న పెద్దమనిషి, మూలనున్నామె యిద్దరూకూడా దిగి, వెనక్కి వెనక్కి చూసుకుంటూ నడక సాగించారు.



‘‘ఛ... మనిషికోమాట, పసువుకోదెబ్బ అన్నారు...’’
“నేనూ అదే నిశ్చయాని కొచ్చాను... ఇకనుండి మిమ్మల్ని ఒక్కమాటకూడా అనదల్చుకోలేదు!—’’

---

‘‘మొత్తానికా అమ్మా యెవరోగాని మొగుణ్ని మాబాగా బుట్టలోవేసుకుంది!” అతనన్నమాటలు కృష్ణమూర్తికి విని పించాయి. పిల్లలిద్దరూ గేట్లో నిలబడి యితనివంక తిరిగిచూసి నవ్వుకొంటూ ఏదో మాట్లాడుకుని పరుగెత్తారు.

లోపలికి తిరిగాడు కృష్ణమూర్తి. అవతలి బెర్త్‌మీద ఘరానామనిషీ భార్యా యితను పిచ్చాడా లేకపోతే మస్తుగా తాగాడా అన్న మీమాంసంలో పడ్డట్టు కళ్ళతో ఏదో మాట్లాడుకుంటున్నారు. యితను వెనక్కి తిరగ్గానే తమతో మాట్లాడతాడేమో అని భయపడ్డట్టు ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ అటువైపు

కిటికీకేసి తిరిగి బయటి విశాల ప్రపంచంలో ఎక్కడో చూస్తూ కూర్చొని పోయారు.

టైం చూశాడు కృష్ణమూర్తి. ఎక్కిన తర్వాత ఆరుగంట లయినట్టే అనిపించ లేదు. తనేదో యితరలోకాల్లో గడిపిన ట్టుందింత సేపూ. చాలా హాయిగా ఉంది.

రైలు నెమ్మదిగా ప్లాట్ ఫారం మీద ఆగింది.

కృష్ణమూర్తి చిన్న యీల వేసుకుంటూ హుషారుగా క్రిందికి దిగాడు. ప్రసాద్ ని చూడగానే కృష్ణమూర్తికి పట్ట లేని ఉత్సాహం కలిగింది. కాని ఎప్పుడూ నవ్వు చిలకరించే ప్రసాద్ మొగంలో విచారంచూసి కృష్ణమూర్తి కొద్దిగా తగ్గాడు. అయినా కూడదీసుకుని ఎంతో ప్రయత్నంతో ఉల్లాసం తెచ్చిపెట్టుకుని బావమరిది బుజంమీద ముందునుంచి గుద్ది అడిగాడు నవ్వుతో, "ఏమిటెలా ఉన్నాడు అల్లుడు?''

కృష్ణమూర్తి నవ్వుతున్న ధోరణి అర్థంగాలేదు ప్రసాద్ కి.

"టెలిగ్రాం అందలేదా, బావా?'' నెమ్మదిగా అన్నాడు.

"టెలిగ్రామా?...అందడమేమిటి?.. అందకనేం?...అందింది..కాని... ఏం....ఏమయింది...?" కృష్ణమూర్తి నెమ్మది నెమ్మదిగా ఒక్కొక్క మెట్టే దిగజారి పోయాడు.

"అంతా అయిపోయింది." ప్రసాద్ గొంతు జీరపోయింది.

కృష్ణమూర్తి కదుగు పడలేదు. అక్కడే కూలబడ్డాడు.

"లే, బావా! యిక్కడ కూర్చునేం సాధిస్తావు? యింటికి పోదాం!"

"నేను వట్టి ఫూల్ ని జానీ! నీ గురించిన కబురు అందుకోకుండా తెలుసుకోకుండా, ఏదేదో వాగి...నీ ఆయువు పొడిగించాలని చూశాను...నన్ను నేనే దగా చేసుకున్నాను!"... కాసేపటికి నెమ్మదిగా అన్నాడు మూర్తి. ఆతర్వాత మాటలు పెగల్లేదు.

"లేవయ్యా, బండొస్తోంది! అని చికాగ్గా అరుస్తూ రైలుకూలీ ఎవడో పట్టాలమీంచి లేవగొట్టాడు. కాసేపట్లో క్రూరంగా గర్జిస్తూ రాసుకుని వెళ్ళిపోయింది రైలు.

